డీసీపీ కార్యాలయం ప్రారంభం

ప్రజలకు శాంతియుత జీవితాన్ని అందించడానికి పోలీసులు శ్రమిస్తున్నారని నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మెహిదీపట్నంలో నూతనంగా ఏర్పాటు చేసిన దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ కార్యాలయాన్ని నగర పోలీస్ కమిషనర్ శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ వి.సత్యనారాయణ, దక్షిణ మండలం డీసీపీ చైతన్య, దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ బాలస్వామి, అదనపు డీసీపీ అశ్వాక్ అహ్మద్, ఏసీపీలు సయ్యద్ ఫయాజ్, రాజావెంకట్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జావెద్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. **- మెహిదీపట్నం, డిసెంబర్ 22**

అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి

అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. శుక్రవారం టోలిచౌకి, గోల్కొండ, నానల్ నగర్ డివిజన్లలోని టోలిచౌకి, అక్బర్ పుర, ఎండీ లైన్స్, శాతం నగర్, అహ్మద్ కాలనీ, అఫ్సర్ కాలనీ, గోల్కొండ, మోతి దర్వాజ ప్రాంతాల్లో పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్ -13 ఇంజనీరింగ్ ఈఈ వెంకట శేషయ్య, డిప్యూటీ ఈఈ రామకృష్ణ, ఎంఐఎం నాయకులు బద్రుద్దీన్, మహ్మద్ హరూన్ ఫర్వాన్ పాల్గొన్నారు.

- మెహిదీపట్నం, డిసెంబర్ 22

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

మెహిదీపట్నం, డిసెంబర్ 22 : బెదిరించిన వ్యక్తిని క్షణికావేశంలో చంపిన నిందితుడిని కుల్సుంపుర పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కుల్సుంపుర పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్సైలు వేణుగోపాల్, మన్మోహన్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. జియాగూడ ఇంద్రానగర్‌లో నివసించే వి.అనిల్‌కుమార్ అలియాస్ లఖన్ (35), యాలమయ్యవాలో గోపి స్నేహితులు. 20 వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో వీరిద్దరూ పురానాపూల్ ప్రాంతంలో గొడవ పడ్డారు. అనిల్.. గోపిని చంపుతానని బెదిరించాడు. దీంతో కోపోద్రిక్తుడైన గోపి.. నువ్వు నన్ను చంపుతావా.. నేనే నిన్ను చంపుతానని దాడిచేసి రాయితో కొట్టడంతో పాటు కత్తితో గొంతులో పొడిచి దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఇమామ్‌పుర శ్మశానవాటిక వద్దకు తీసుకెళ్లి ఆనవాలు లేకుండా కాల్చివేశాడు. గురువారం ఘటన వెలుగు చూడగా శుక్రవారం అనిల్‌ను చంపిన గోపిని పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



రామానుజన్ చిరస్మరణీయుడు

రిటైర్డ్ ప్రొఫెసర్ ధర్మయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్

రమేశ్‌బాబుకు రామానుజన్ అవార్డును అందజేస్తున్న తెలంగాణ మేధావుల ఫోరం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 22 : నిరుపేద కుటుంబంలో జన్మించి తన మేధోశక్తితో ప్రపంచంలో శ్రీనివాస రామానుజన్ తనకంటూ గుర్తింపు సంపాదించుకున్నారని రిటైర్డ్ ప్రొఫెసర్ ధర్మయ్య అన్నారు. శుక్రవారం మాసాబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో రామానుజన్ జయంతి సందర్భంగా నేషనల్ మ్యాథమెటిక్స్ డేలో భాగంగా ' రీ సెంట్ అప్లికేషన్ ఇన్ మ్యాథమెటిక్స్' పై జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. రామానుజన్ సిద్ధాంతాలు, పరిష్కారాలు, 1729 మ్యాజిక్ నంబర్, 6165 అంశాలపై పరిశోధనలు చరిత్రలో నిలిచాయన్నారు. రాయల్ సొసైటీ ఫెలోషిప్‌ని అందుకున్న ఘనత రామానుజన్‌కే దక్కిందని కొనియాడారు. ఈ సందర్భంగాప్రొఫెసర్ ధర్మయ్యను శాలువా, జ్ఞాపికతో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్‌నాయక్ సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, మ్యా థమెటిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ విజయలక్ష్మి, డాక్టర్ ఈ.రమ, డాక్టర్ పృథ్వీ, డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, యూజీ, పీజీ విద్యా ర్థులు పాల్గొన్నారు.

డాక్టర్ రమేశ్‌బాబుకు రామానుజన్ అవార్డు

అబిడ్స్, డిసెంబర్ 22: రామానుజన్ తన య జీవితాన్ని గణిత శాస్త్ర అభివృద్ధికి త్యాగం చేశారని ఉస్మానియా యూనివర్సిటీ జియోగ్రఫి మాజీ అధిపతి ప్రొఫెసర్ బి.లక్ష్మయ్య అన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్వర్యంలో రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. 25 ఏండ్లుగా ఉస్మానియా యూనివర్సిటీలో గణిత శాస్త్ర విభాగం అధిపతిగా ఉంటూ ఎన్నో జాతీయ , అంతర్జాతీయ పురస్కారాలు, గణిత శాస్త్రంలో పరిశోధనలు, ప్రసంగాలు చేసి గణితంలో ఎనలేని కృషి చేస్తున్న డాక్టర్ కె. రమేశ్‌బాబుకు రామానుజన్ ఎక్సలెన్సీ అవార్డు-2023ను అందజేసి కిరీటంతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్, ప్రముఖ నటుడు షేక్ రహమతుల్లా, డాక్టర్ పి. తిరుపతి, ఎం. రాజు, నీలవేణి, టి. ప్రవంతి, వి. అక్షయ, కాశమౌని, శ్యాంరావు ముదిరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

తన తల్లి శీలావతి బాయి జైస్వాల్ వర్ధంతిని పురస్కరించుకొని పుత్లీబౌలి ఎంజీబీఎస్ జంక్షన్ వద్ద పేదలకు దుప్పట్లు, ఉలన్ దుస్తులను జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మయూర్ కేల్కర్, బాయక్క, ప్రాచీ, సంగీత, కలాల్, రామకృష్ణ, రాజు, నర్సింగ్ పాల్గొన్నారు.

- అబిడ్స్, డిసెంబర్ 22

మాజీ మంత్రి, దళిత నాయకుడు జి.వెంకటస్వామి (కాకా) వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద్ పూలమాల వేసి నివాళుర్పించారు.

- రవీంద్రభారతి, డిసెంబర్ 22

టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో..

టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ, సభ్యుల సమక్షంలో శుక్రవారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని జిల్లా శాఖ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు హాజరైన కుమారి బి.రేచల్, సీమా ముజీబ్, టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, సభ్యులు పర్వతాలు, నగర శాఖ నాయకుడు శ్రీకాంత్, నాల్గవ తరగతి అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, కార్యదర్శి ఖాదర్‌బిన్ హసన్, జిల్లా శాఖ కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్‌తో కలిసి ఏసు ప్రభువు బోధకుల సమక్షంలో డాన్‌బాస్కో అనాథ చిన్నారులతో కేక్ కట్ చేయించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు, ఉద్యోగులకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డాన్ బా స్కోకు చెందిన 30 అనాథ చిన్నారులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కోశాధికారి బాలరాజు, ఉపాధ్యక్షులు ఉమర్‌ఖాన్, కురాడి శ్రీనివాస్, సభ్యులు సుజాత, గీత, శ్రీధర్ నాయుడు, ఏపీఆర్వో మహ్మద్ వహీద్, మాజీ కార్యదర్శి ప్రభాకర్, జానకి, వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. **- సుల్తాన్‌బజార్, డిసెంబర్ 22**

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జైల్ గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, సహకార్ మజ్దూర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఉద్యోగులు, కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందజేయడంతో పాటు జీహెచ్ఎంసీ శానిటరీ వర్కర్స్, ఎంటమాలజీ వర్కర్స్, ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, వెటర్నరీ వర్కర్స్, యూబీడీ వర్కర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల కార్మికుల ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. త్వరలోనే జీహెచ్ఎంసీ కార్మికుల తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయ్‌కుమార్ యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మంద రవి, జగన్‌మోహన్ రెడ్డి, జహీరుద్దీన్, రఫి పాల్గొన్నారు. **- అబిడ్స్, డిసెంబర్ 22**

కోర్టు ఎదుట లొంగిపోవాలని శివరామ్‌కు ఆదేశాలు

నాంపల్లి కోర్టులు, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో శివరామ్‌రాథోడ్ 9వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు కావాలని జిల్లా కోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. శుక్రవారం గడువుదినం కావడంతో కోర్టు ఎదుట హాజరు కాలేదు. ప్రవళిక ఆత్మహత్య కేసులో నిందితుడిగా ఉన్న శివరామ్‌ను గతంలో కోర్టు రిమాండ్‌ను తిరస్కరించడంతో అధికారులు జిల్లా కోర్టును ఆశ్రయించారు. సాక్ష్యాధారాలను జిల్లా కోర్టుకు అందించడంతో ఉత్తర్వులు జారీ చేసింది. నిందితుడు లొంగిపోని సమక్షంలో మెజిస్ట్రేట్ వారెంట్ జారీ చేసే అవకాశమున్నది. నిందితుడు కోర్టు ఎదుట లొంగిపోయినట్లైతే కోర్టు రిమాండ్‌కు తరలిస్తుంది. శుక్రవారం 5 గంటల వరకు నిందితుడు లొంగిపోలేదు. ఈ నేపథ్యంలో నిందితుడి తరపున న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించే అవకాశమున్నది.

కోఠిలోని విశ్వ హిందూ పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర తెలంగాణ ప్రాంత కార్యాలయాన్ని తీర్థక్షేత్ర తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ రాజేశ్వర్‌రెడ్డి, సహ కన్వీనర్ జి.జగదీశ్వర్, వీహెచ్‌పీ ప్రాంత విశేష్ సంపర్క్ ప్రముఖ్ వెంకటేశ్వర్ రావు ప్రారంభించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2024 జనవరి 22న భవ్య శ్రీరామ మందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కోసం ఏర్పాట్లు పూర్తవుతున్నాయన్నారు. మధ్యాహ్నం 12 : 30 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని దూరదర్శన్‌లో లైవ్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు వీరేష్ లింగం, శ్రీకాంత్, భరత్‌వంశీ, అభిషేక్, తిరుపతి పాల్గొన్నారు. **- సుల్తాన్‌బజార్, డిసెంబర్ 22**

చైనా మాంజా చిక్కుల నుంచి విముక్తి..

స్వేచ్ఛగా విహరించిన పావురాయి

చైనా మాంజాను ప్రభుత్వం నిషేధించినా.. కొందరు విక్రయిస్తున్నారు. ఫలితంగా మూగప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నాయి. గొల్లకిడికి ప్రాంతంలో శుక్రవారం ఓ పావురాయి గాల్లో ముందుకు వెళ్తున్న క్రమంలో ఓ చెట్టుకు వేలాడుతున్న చైనా మాంజాకు చిక్కుకుంది. దారిలో వెళ్తున్న విద్యార్థులు పావురాయిని రక్షించేందుకు ప్రయత్నించి విఫలమైయ్యారు. ఆ మార్గంలో వెళ్తున్న ఓ వ్యక్తి విడిపించి స్వేచ్ఛ కల్పించాడు. దాంతో అది సంతోషిస్తూ తన రెక్కలను మరింత బలంగా కదిలిస్తూ ఆకాశమార్గాన ప్రయాణించింది. **- చార్మినార్, డిసెంబర్ 22**